# పుస్తక పరిచయం




Published by:

**Muvva Chinabapireddy Memorial Trust,**
Pedaparimi,
Guntur.

**"నా మటుకు నేను** సాహిత్యానికి ఋణపడి ఉంటాను. అది నాకు సంస్కారం నేర్పింది. మానవీయ పరిమళం అద్దింది. లోకాన్ని దర్శించాల్సిన కోణాలను పరిచయం చేసింది.." అంటారు 'వెంట వచ్చునది' కథా సంపుటి రచయిత ఎంవీ రామిరెడ్డిగారు. పాఠకులుగా మిగిలిపోయిన వాళ్ళు 'సాహిత్యం నాకు మేలుచేసింది' అనడం సహజమే కానీ రచయితలైన వాళ్ళలో 'నేను సాహిత్య సేవ చేశాను, చేస్తున్నాను' అని కాకుండా 'నేను సాహిత్యం నుంచి నేర్చుకున్నాను' అనడం చాలా అరుదైన విషయం. ఈ విలక్షణ వ్యక్తిత్వమే రామిరెడ్డిగారిని విలక్షణ రచయితగా కూడా తీర్చిదిద్దింది.. ఒక వైపు కవితలను, మరో వైపు కథలను కూడా నిబద్ధతతో, నిజాయితీతో, ప్రామాణికతతో సామాజిక ప్రయోజనాలనాశించి వ్రాస్తున్న రామిరెడ్డిగారు రచయితగానూ, వ్యక్తిగానూ కూడా అభినందనీయులు, స్వలాభేపేక్షలేకుండా, సొంత నిధులను వెచ్చించి సైతం గత రెండు దశాబ్దాలుగా ఆయన చేస్తున్న సేవాకార్యక్రమాలు ఎంత ప్రత్యేకమో, ఆయనవ్రాసిన ప్రతి రచనా అంత ప్రత్యేకమే. రామిరెడ్డిగారి కలం నుంచి (అనేకంటే హృదయం నుంచి అనడం సబబుగా ఉంటుంది) వెలువడిన రెండవ కథా సంపుటి ఈ 'వెంట వచ్చునది'. ఇందులో ఉన్నవి కథలు కాదు , వాస్తవ గాథలు, కొన్ని తెలిసినవి, మరికొన్ని ఎక్కువమందికి తెలీనివి. వెరసి ఒక్కో కథా ఓ సరికొత్త ప్రపంచాన్ని పాఠకుల కళ్ళముందు ఆవిష్కరిస్తుంది. ఆలోచింపచేస్తుంది. మొత్తం కథలన్నీ చదవడం పూర్తయేసరికి మనచుట్టూ జరుగుతున్న సంఘటనలను చూసే కోణంలో మార్పు రావాల్సిన అవసరం కనిపిస్తుంది. "ముళ్ళూ పూలూ" కథలో పిల్లలను అర్థం చేసుకోవాల్సిన కోణాన్నీ, మంచీ చెడూ గమనించాల్సిన అంశాలనూ మనసుకి హత్తుకునేలా చిత్రించారు రచయిత. "కొండ  అద్దమందు" కథలో ప్రభుత్వ కాంట్రక్టర్లూ, వాళ్ళు ఒప్పుకున్న పనిని మరింతగా పొడిగించి ఇటు బాధితులనూ, అటు ప్రభుత్వాన్నీ దోచుకునే విధానమూ ఎలా ఉంటుందో ఆసక్తికరంగా వివరించారు. "రేపటి బీడు" మనసుల్ని కలచివేసే కథ. వర్తమానంలో జారుగుతున్న సంఘటనలకు దర్పణం. రాజాధాని నిర్మాణం పేరుతో ధ్వంసమైపోతున్న రైతుజీవితాన్నీ, మాయమైపోతున్న వేలాది ఎకరాల పచ్చదనాన్ని రచయిత చెప్పిన విధానం మనసునూ, కళ్ళనూ తడిచేస్తుంది. "ప్రభుత్వానికి నా వంతు కానుకగా (పొలాన్ని) ఇచ్చేశాను. తల్లివేరు తుంచుకున్నాను. మట్టిబంధం తెంచుకున్నాను. రేపట్నుంచి ఎలా బతకాలి? తెల్లారే లేచి, ఏ దిక్కుగా నడవాలి? నాగలిని ఏం చెయ్యాలి" అన్ని శ్రీను గుండేలవిసేలా విలపిస్తుంటే కుహనారాజకీయాల పట్ల కోపం రాని పాఠకులుండరు. "కంకాళాల శాల", " మృగయా", "వెంట వచ్చునది",' "అవయువలు మొలిచిన మనిషి" సరికొత్త శైలిలో సాగిన కథలు. తను ఆలోచించి, పదిమందినీ ఆలోచింపచేసే కథలు వ్రాస్తున్న రచయిత కలంనుంచి మరిన్ని ఇలాంటి మంచి కథలు నిరంతరం వస్తూ ఉండాలని మనసారా శిద్దాం.

★★★




**Published by:**
**Indraganti Family**
**104, Sahithi Residency**
**Premnagar Colony**
**Sainikpuri**
**SECUNDERABAD – 84**
**Cell: 98480 78079**

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా ‘కౌముది‘ విజ్ఞప్తి చేస్తోంది.

Editor,
KOUMUDI (Web Monthly)
4251 - Escudo Ct
Dublin - CA 94568, USA

**తెలుగు సాహితీ** ప్రపంచానికి ఇంద్రగంటి శ్రీకాంత్‌శర్మగారిని ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. కవిత్వం, లలితగీతం, చలనచిత్రగీతం, యక్షగానం, కథ, నవల, నాటకం, నాటిక, వ్యాసం - ఇలా అనేక ప్రక్రియల్లో శ్రీకాంత్‌శర్మగారి కలం తన పదును చూపెట్టింది. శ్రీకాంత్‌శర్మగారికి సాహితీ వారసత్వం తమ నాన్నగారి నుంచి వస్తే, అదే వారసత్వం మరోరూపంలో వాళ్ళ అబ్బాయికి సంక్రమించింది. 20 వశతాబ్దపు ప్రముఖరచయితల్లో ఒకరైన ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు శర్మగారి తండ్రి ఐతే, ఈ తరం సినిమాల విజయవంతమైన దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ శర్మగారి అబ్బాయి. శర్మగారు ఊహతెలిసిన వద్దనుంచే, వాళ్ళ నాన్నగారిని కలుసుకోడానికి వచ్చే, హేమాహేమీలైన పండితులమధ్య పెరిగారు. అందుకే ఆయన జీవితపు దారి పొడవునా సాహిత్యపరిమళాలు విరజిమ్ముతూనే ఉన్నాయి, ఉంటాయి. వాస్తవం కల్పనకంటే చిత్రమైనది ఒక నానుడి. మామూలాగే ఎవరి జీవితాన్ని తీసుకున్నా , బాల్యం నుంచి జరిగిన సంఘటనలని వరుసగా కూర్చగలిగితే ఏ కాల్పనిక నవలకన్నా కూడా ఆసక్తికరంగ ఉంటుంది. మామూలు జీవితాల సంఘటనలే అంత ఆసక్తికరమనిపిస్తే శ్రీకాంత్‌శర్మగారి లాంటి బహుముఖ ప్రజ్ఞావంతుల జీవితంలోని మలుపులు ఎంత ఆసక్తికరంగా ఉంటాయో ఊహించుకోవచ్చు. వాళ్ళనాన్నగారి జీవితం నుంచీ ప్రారంభించి, తన బాల్యం, మొదట్లోని పాత్రికేయ ఉద్యోగం, తరువాత ఆకాశవాణి ఉద్యోగం, మళ్ళీ పాత్రికేయ జీవితం - ఈ సుదీర్ఘ పయనంలో తారసపడిన రచయితలు, కవులు, కళాకారులు, హేమాహేమీలు, ఉద్దండులు, ప్రముఖవ్యక్తులు, హూ ఈజ్ హూలు... వెరసి ఈ పుస్తకం లోని ప్రతిపేజీలోనూ, ప్రతి సంఘటనలోనూ దశాబ్దాల తెలుగు సాహితీచరిత్ర, ఆకాశవాణి చరిత్ర కనిపిస్తుంది. ఆత్మీయంగా పలకరిస్తుంది. శర్మగారు ఐతే -"నేను ఏ ఉద్యమాలలోనూ పనిచేసినవాడిని కాను. నేనెరిగినది, తెలుగు సాహిత్యం గురించి, అందునిమిత్తంగా నడిచిన ఘటనలగురించి, ధునిక సాహిత్యంతో మాకుటుంబానికున్న సంబంధం గురించి నేనెరిగిన ఘటనలకు చారిత్రక ప్రాధాన్యం ఉంది" అని చెప్పుకున్నారు, కానీ శర్మగారి జీవితంలోని సంఘటనలు ఏ ఉద్యమకారుడి జీవితానికీ తీసిపోనంత ఆసక్తికరంగా ఉన్నాయి.. ఒక ప్రసిద్ధరచయిత ఆత్మకథ ఎంత ప్రామాణికంగా, ఎంత విశదంగా, ఎంత ప్రణాళికా బద్ధంగా ఉండాలో అన్నింటినీ సంతరించుకుంది ఈ పుస్తకం. వాళ్ళనాన్నగారు చనిపోయాక అమ్మగారిపోషణ గురించి కుటుంబసభ్యులంతా చర్చించుకోవడం లాంటి అనేక సంఘటనలు చదువుతుంటే ‘ఇవే కదా కథలుగా వచ్చే సన్నివేశాలు‘ అనిపిస్తుంది. ఆపకుండా చదివించే శైలి, అడుగడుగునా ఆసక్తి కలిగించే సంఘటనలూ - మొత్తానికి పుస్తకం మొదటనుంచీ శర్మగారు పాఠకుడు చేయిపట్టుకుని నడిపిస్తూ తన జీవితాన్నేకాదు, తనతో పెనవేసుకున్న అనేక జీవితాలని కళ్ళకు కట్టినట్లు చూపించారు. అందరూ తప్పక చదవాల్సిన ఆత్మకథ ఈ "ఇంటిపేరు ఇంద్రగంటి‘.

***